వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

- వేణుగోపాల స్వామి ఆలయాల్లో కల్యాణోత్సవాలు
- నందలూరు యాదవ సంఘం ఆధ్వర్యంలో కల్యాణం, అన్నదాన కార్యక్రమం


పెనగలూరు: పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి


రైల్వేకోడూరు అర్బన్: అలంకరణలో శ్రీకృష్ణుడు

రైల్వేకోడూరు : మండలంలోని మైసూరువారిపల్లె పంచాయతీలోని గుంజన నది ఒడ్డున వెలసిన వేణుగోపాలస్వామి దేవస్థానంలో గురువారం శ్రీకృష్ణుడి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల నేతృత్వంలో కల్యాణం జరిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నరసింహయాదవ్, కమిటీ సభ్యులు బత్తిన గంగయ్య, దార్ల చంద్రశేఖర్, యజ్జం చంద్రశేఖర్, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు వేణుగోపాలస్వామి ఆలయంలో..

పెనగలూరు : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఆలయ చైర్మన్ పంచేటి సుబ్బారెడి, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే వేదపండితులు స్వామివారికి అభిషేకం, పూలంగిసేవ, మధ్యాహ్నం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో పలువురు చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమికి ప్రతి ఏడాది ఆలయంలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ అని తెలిపారు.

నందలూరులో వైభవంగా కల్యాణం

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలోని అరవపల్లెలో శ్రీ కృష్ణా గీతామందిర సమీపంలో ఏర్పాటు చేసిన కల్యాణవేదికపై రాధ, శ్రీకృష్ణ, సత్యభామల కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా సుందరంగా అలంకరించిన ఉత్సవమూర్తులను వేదికపై ఆసీనులు చేయించారు. వేదపండితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారుల చిన్ని క్రిష్ణుని వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం ఊరేగింపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కాగా కల్యాణంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొన్నారు. జెడ్పీ చైర్మన్‌ను నిర్వాహకులు ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు.

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

శ్రీకృష్ణ, రాధ, సత్యభామ కల్యాణోత్సవంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకొని పూజలు నిర్వహించారు.

రాజంపేటలో..

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం కూడా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనేక ప్రాంతాల్లో రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణోత్సవాలను జరిపారు. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల్లో గ్రామోత్సవం ఘనంగా జరిగింది. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు కృష్ణుడు, గోపికల వేషధారణలు వేసి ముచ్చటపడ్డారు. అంతటా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించడంతో కోలాహల వాతావరణం నెలకొంది.

వీరభద్రస్వామి ఆలయంలో గోకులాష్టమి పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో గోకులాష్టమి పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, పాలక మండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు గోకులాష్టమి విశిష్టతను వివరించి చెప్పారు. పూజలు పూర్తయిన తరువాత భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఈ పూజలలో మున్సిపల్ వైస్ చైర్మన్ పి.దశరథ రామిరెడ్డి, పాలక మండలి సభ్యులు రత్నశేఖర్‌రెడ్డి, నాగభూషణం, లక్ష్మీపతి, స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు బెంగుళూరుకు చెందిన అర్జున్ మైత్రీ, వారి కుటుంబసభ్యుల ఆర్థిక సహకారంతో ఉచిత అన్న ప్రసాదాన్ని అందజేశారు. వీరిని ఆలయ అధికారులు సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.


రాజంపేట: జెడ్పీచైర్మన్ ఆకేపాటిని సన్మానించిన యాదవ సంఘం నేతలు


రాయచోటి టౌన్: గోవులకు పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా విగ్రహ ప్రతిష్ట


ఆలయంలో కొలువైన శ్రీ కృష్ణుడు

గాలివీడు : మండల కేంద్రంలోని అరవీటివాండ్లపల్లె శ్రీకృష్ణ నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణుడి ఆలయంలో అర్చకులు నాగఫణి కిషోర్ శర్మ ఆధ్వర్యంలో గురువారం వేకువజామున పీఠ పూజ, యంత్ర స్థాపన, విగ్రహ స్థాపన, ప్రాణప్రతిష్ట వంటి కార్యక్రమాల మధ్య శ్రీ కృష్ణ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను, అన్నదాన కార్యక్రమాలను నిర్వాహకులు చేపట్టారు.


రాజంపేట: కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

సిద్దవటం : మండల కేంద్రం సమీపంలోని మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద వెలసిన శ్రీ రాధా కృష్ణ స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని గురువారం శ్రీ రాధా కృష్ణ స్వామి వారికి అభిషేకం, అలంకరణ, గణపతిపూజ, పుణ్యహావాచనం, పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మహానివేదన తదితర పూజా కార్యక్రమాలను వేద పండితులు హరి శర్మ, నరసింహ శర్మలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

పెనగలూరు ఇన్‌చార్జ్ డీటీగా మురళీకృష్ణ



పెనగలూరు : మండల డిప్యూటీ తహసీల్దార్‌గా మురళీకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. చిట్వేలి డీటీగా పనిచేస్తున్న ఆయన పెనగలూరు మండలానికి ఇన్‌చార్జ్ డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. గతంలో పెనగలూరులో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సుజాత రాజంపేట తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ కాగా అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉంది.

గుర్తింపు కార్డుల పంపిణీ

పెనగలూరు : చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు గురువారం గుర్తింపు కార్డులను పంపిణీ చేసినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ తెలిపారు. ఈ పాఠశాలలో 275 మంది విద్యార్థులు ఉండగా ప్రతి ఒక్కరికీ ఉచితంగా గుర్తింపు కార్డులను పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి ప్రతిరోజూ ఈ గుర్తింపు కార్డులను మెడలో వేసుకొని పాఠశాలకు రావాలని వారు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధనుంజయరెడ్డి, ఉపాధ్యాయులు బి. హరిప్రసాద్, అన్వర్ బాషా, ప్రమీల, శ్రీవాణి, మహేంద్ర, పరిమళ, నరసింహులు, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వినాయకచవితి వేడుకకు ఏర్పాట్లు


ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశమైన కమిటీ సభ్యులు

రాజంపేట టౌన్ : పట్టణాల్లోనేగాక, ఇటు గ్రామీణ ప్రాంతాల్లోనూ వినాయకచవితికి ప్రత్యేకత ఉంది. బృందాలుగా ఏర్పడి వీధివీధినా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి వేడుక జరుపుతారు. ఈ ఏడాది ఉత్సవాలకు ఇప్పటికే ఉత్సవ కమిటీ ప్రతినిధులు తరచూ సమావేశమై తొమ్మిది రోజుల పాటు గణపయ్య వేడుక నిర్వహణపై చర్చించారు. చాలా ప్రాంతాల్లో హరికథ, కోలాటం, చెక్కభజన కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజంపేటలో రాజస్థాన్‌కు చెందిన కార్మికులు దాదాపు ఏడెనిమిది నెలలుగా గణపయ్య విగ్రహాలను తయారు చేసి సిద్ధంగా ఉంచారు. మరో రెండు, మూడు రోజుల్లో గణపయ్య విగ్రహాలను కొలువు దీర్చేందుకు భారీ మండపాలు సిద్ధమవుతున్నాయి.

జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేను కలిసిన గల్ఫ్ వైఎస్సార్‌సీపీ నేతలు


ఆకేపాటితో గల్ఫ్, కువైట్ వైఎస్సార్‌సీపీ నేతలు

రాజంపేట : రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని వారివారి స్వగృహాల్లో గల్ఫ్ వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. గురువారం ఆకేపాటి ఎస్టేట్‌లో జెడ్పీ చైర్మన్‌ను కలిసి శాలువా కప్పి సన్మానించారు. గల్ఫ్, కువైట్ కన్వీనర్లు బీహెచ్ ఇలియాస్, ముమ్మడి బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఈ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే మేడా భవన్‌లో శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డిని కలిసి సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కో–కన్వీనరు గోవిందునాగరాజు, కో–కన్వీనరు నరసారెడ్డి, సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి, యువజన విభాగం సభ్యులు షేక రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి

రాజంపేట టౌన్ : ప్రతి రైతు తప్పనిసరిగా సాగు వివరాలను ఈ పంటలో నమోదు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి జి.సురేష్ బాబు తెలిపారు. మండలంలోని ఆకేపాడు, హస్తవరం, సచివాలయాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన అరటి, బొప్పాయి, మామిడి, కూరగాయలు, పూలు ఇతర ఉద్యాన పంటల సాగు వివరాలు ఈ క్రాప్ ద్వారా జరుగుతున్న నమోదు ప్రక్రియను ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు సాగుచేసే తమ పంటల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బందిచే ఈ పంటలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ శివప్రసాద్, రామ్మోహన్‌రాజు, రైతులు పాల్గొన్నారు.

నేడు జిల్లా కలెక్టర్ రాక

గాలివీడు : నేడు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాంపై స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శేఖర్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామాల్లో పలు సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు, సచివాలయం సిబ్బంది హాజరై సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం


పుల్లంపేట: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రామకృష్ణమనాయుడు


రాజంపేట: ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న అధ్యాపకులు బృందం

నందలూరు(రాజంపేట) : రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత డా.పెద్దిరెడ్డి నీలవేణిని నందలూరు జూనియర్ కళాశాల అధ్యాపక బృందం గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నీలవేణి మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ నీలవేణి సేవలు విద్యార్థులు వినియోగించుకొని ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా సమావేశంకు ప్రముఖ అధ్యాత్మికవేత్త పసుపులేటి శివశంకర్, ధర్మాచార్యులు జి.వెంకటరమణలు హాజరయ్యారు.

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ మాజీ రీజనల్ చైర్మన్ మద్దిపాటి రామకృష్ణమనాయుడు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని మారుమూల ప్రాంతాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నారని, ఇందుకోసం సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందించారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తా


ఆటోడ్రైవర్ల సమస్యలను వింటున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లు కొరముట్లను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందించారు. వినతుల పట్ల సానుకూలంగా స్పందించిన ఆయన తక్షణం పరిష్కరిస్తానని హామీనిచ్చారు. అలాగే ఆటో డ్రైవర్లు, ఓనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఆటో రంగాన్ని రక్షించడానికి పూర్తిస్థాయిలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మల్లు క్రిష్టారెడ్డి, హరిక్రిష్టారెడ్డి, బందారు మల్లి, బత్తల సుబ్రమణ్యం, రమణారెడ్డి పాల్గొన్నారు.

అన్ని గ్రామాలలో పక్కా రోడ్లు

ఓబులవారిపల్లె : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో పక్కా సిమెంట్ రోడ్లు వేయించి అభివృద్ధి చేస్తామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని సిమెంట్ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధే లక్ష్యంగా అన్ని గ్రామాలలో కోట్లాది రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్లు వేసి అభివృద్ధి చేశామన్నారు. స్థానిక సర్పంచ్ జయపాల్ రెడ్డి ప్రభుత్వ నిధులతో దాదాపు రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. కార్యక్రమంలో వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, పంజం సుకుమార్ రెడ్డి, ధ్వజారెడ్డి, సుధాకర్ రాజు, తల్లెం రమణారెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడికి నివాళి

మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి తండ్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఓబిలి గంగిరెడ్డి (87) అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి నాయకులతో కలిసి ఆయన మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

కూలీదండు మహాసభను జయప్రదం చేయండి

పెనగలూరు : కూలీదండు మహాసభను విజయవంతంగా నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం పెనగలూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు రేవూరు శంకరయ్య, ఈరి భాస్కర్‌లు అన్నారు. గురువారం పెనగలూరులో మహాసభ గోడపత్రాలు విడుదల చేసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కామ్రేడ్ పండుగోల మణి మాట్లాడుతూ కోడూరు పట్టణంలో ఈనెల 17, 18వ తేదీలలో కూలీదండు మహాసభ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ మహాసభలో కార్మికులు, ఉపాధిహామీ కూలీలు, వ్యవసాయ కూలీలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీకేఎంయూ సభ్యులు ఈరి నరసింహులు, రేవూరు చిన్నయ్య, రెడ్డయ్య, నవీన్, సుబ్బరాయుడు, గంగయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనులపై తనిఖీ

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల, కల్పనాయినిచెరువు, సరస్వతిపల్లె గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పథకం కూలీలు చేసిన పనులకు సంబంధించి సామాజిక బృందం ఆయా గ్రామాల సచివాలయంలో గురువారం గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సుద్దమళ్ల గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో 265 పనులకు రూ. 2.10కోట్లు జరిగాయని, గ్రామంలో మొత్తం 772 జాబ్‌కార్డులు ఉండగా అందులో 611 మంది కూలీలు పనులు చేశారన్నారు. ఈ గ్రామంలో ఉపాధి పనులతో పాటు హౌసింగ్ ఆర్టికల్చర్స్ చేపట్టిన పనులపై సామాజిక బృందం రికార్డును పరిశీలించారు. కల్పనాయినిచెరువు గ్రామంలో 121 పనులు సంబంధించి రూ. 70.29లక్షలు ఖర్చు చేశారన్నారు. అందులో హౌసింగ్ హార్టికల్చర్స్ కోటా తదితర, పూడికతీత పనులపై అధికారులు రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో మొత్తం 500 జాబ్‌కార్డులు ఉండగా 408 జాబ్‌కార్డుకు సంబంధించిన కూలీలు పనుల రికార్డులను కూడా తనిఖీ బృందం పరిశీలించారు. సరస్వతిపల్లె గ్రామంలో 67 పనులు సంబంధించి రూ40లక్షలు వరకు ఉపాధి పథకం పనులు చేపట్టారు. ఈ పనులు హౌసింగ్, హార్టికల్చర్స్, పూడికతీత పనులపై, గ్రామంలోని మొత్తం 396 జాబ్‌కార్డులు ఉండగా అందులో 386 మంది జాబ్‌కార్డులకు సంబంధించి పలు రికార్డులను గ్రామ సచివాయలంలో ఉపాధి కూలీలతో సమావేశంలో సామాజిక బృందం రికార్డులను పరిశీలించారు.

అట్టహాసంగా ప్రారంభమైన ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు


సంబేపల్లె: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు

సంబేపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు గురువారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను మండల స్థాయిలో రెండురోజులపాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. మండలస్థాయిలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో అండర్–14, అండర్–17 విభాగాలలో తొమ్మిది క్రీడాంశాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్, క్రీడా పోటీలు కన్వీనర్లు సురేంద్రరాజు, అమర్‌నాథరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సోమశేఖర్ రెడ్డి, సునీత, హేమలత, షామీర్, ఉపాధ్యాయులు భాస్కర్, చక్రవాణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్ పరిధిలో శుక్రవారం నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు జరుగునని 11వ బెటాలియన్ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎం.డీ. జాఫర్ తెలిపారు. మండలంలోని 11వ బెటాలియన్‌లో జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించనున్నామన్నారు. అందుకోసం ఎవరు ఏ పాఠశాలతో ఆడాలో ఫిక్చర్ వేశామన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె. రామచంద్ర, షేక్ సిరాజుల్లా, రెడ్డెమ్మ, సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి రాయచోటి మండలంలో..

రాయచోటి టౌన్ : ఈనెల 11వ తేదీ రాయచోటి ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్‌కు సంబంధించి ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ గోపాల్, నియోజకవర్గ కో ఆర్డినేటర్లు జగదీశ్వరయ్య, నరసనరాజులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్, బాల్ బాడ్మింటన్, షటిల్, యోగా, టెన్నీకాయిట్ వంటి క్రీడలకు సంబంధించి అండర్ –11, అండర్–14, అండర్ –17 బాల – బాలికలకు ఈ సెలెక్షన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికకు వచ్చే విద్యార్థులు అర్హతకు సంబంధించిన సర్టిఫికెట్, మిడ్డే మీల్స్ అక్విటెన్స్ తీసుకరావాలని కోరారు. ఎంపిక కార్యక్రమం 11న ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

ఉపాధి పనులు సక్రమంగా కొనసాగాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

సుండుపల్లె(రాజంపేట) : ఉపాధి పథకం కింద చేపట్టే పనులు సక్రమంగా కొనసాగాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ముండుపాడు, మాచిరెడ్డిగారిపల్లె, పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ముఖ్యమైన పనులను ఎంచుకోవాలన్నారు. గ్రామస్తులతో చర్చించి, గ్రామానికి ఉపయోగకరంగా ఉండేలా పనులు ఎంపిక జరగాలన్నారు. ఉపాధి హామీ పథకం లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఉపాధి హామీ ఉద్దేశాలపై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ, జెడ్పీటీసీ ఇస్మాయిల్, జేసీఎస్ ఇన్‌చార్జి రెహమాన్, సర్పంచి షరీఫ్, నాయకులు ఆకుల శ్రీను, ఆనందరెడ్డి, నరసింహారెడ్డి, ఎల్వీరమణ, మధుబాబురెడ్డి, కలీం, ఉపాధి హామీ పథకం ఏపీఓ మాలిక్‌బాషా, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పేదల తలుపు తడుతున్న సంక్షేమ పథకాలు

- అభివృద్ధితోపాటు సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ఎజెండా
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


మహిళకు అభివాదం చేస్తున్న రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలే పేదల్ని వెతుక్కుంటూ వారి తలుపు తడుతున్నాయని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి రూరల్ మండలం, గొర్లముదివీడు గ్రామంలో రెండరోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని శ్రీకాంత్ రెడ్డి నిర్వహించారు. గొర్లముదివీడు, కస్బా, హరిజనవాడ, చెర్లోపల్లె, బిడికిలలో గడప గడపకు శ్రీకాంత్ రెడ్డి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ, సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆప్యాయంగా, ప్రేమానురాగంగా పల్లె ప్రజలను పలుకరిస్తూ సమస్యల పరిష్కారంపై చొరవ చూపుతూ, అర్హత ఉండి పథకాలు అందని వారికి పథకాలు వర్తించేలా అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. గ్రామ ప్రజలే తోడుగా, అధికారులు వెంట రాగా ప్రతి గడపను పలుకరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల క్యాలెండర్ పేద వర్గాలకు వెల్ఫేర్ క్యాలెండర్ అని పేర్కొన్నారు. ప్రజలకు సంక్షేమంతోపాటు అభివృద్ధి చేయడమే వైఎస్సార్‌సీపీ ఎజెండా అని తెలియజేశారు.

నూతన పింఛన్లు మంజూరు

నూతన పింఛన్ల మంజూరుతో పండుటాకుల్లో సంతోషం వెల్లివిరిసింది. ప్రతినెల ఒకటో తేదీన సూరీడు ఉదయించకముందే తలుపుతట్టి పింఛన్ సొమ్మును వలంటీర్లు అందజేస్తున్నారని గొర్లముదివీడు అవ్వాతాతలు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి తెలిపారు. గొర్లముదివీడు గ్రామంలో ప్రస్తుతం నూతనంగా 35 పింఛన్లు మంజూరయ్యాయి. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బసిరెడ్డి సిద్దారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు బసిరెడ్డి సుబ్బారెడ్డి, బీసి నాయకుడు పల్లవు రమేష్, రాజారెడ్డి, విశ్వనాథ రెడ్డి, ఈశ్వరయ్య, చెన్న కృష్ణ మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, మహేశ్వరరెడ్డి, పల్లెల నాగమల్ రెడ్డి, చింతం రామచంద్రారెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలనలో గ్రామీణ రహదారులకు మహర్దశ కలుగుతోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి మండలంలోని గొర్లముదివీడు రోడ్డు నుంచి చెర్లోపల్లె వరకు రూ. 52.50 లక్షల నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. టిటిడి ఢిల్లీ ప్రాంతీయ సలహామండలి సభ్యుడు బసిరెడ్డి సిద్దారెడ్డి, మాజీ ఎంపీటీసీ పోలుసుబ్బారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి గురువారం ఎమ్మెల్యే పూజలు నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

చారిత్రాత్మకం.. సచివాలయ వ్యవస్థ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ చారిత్రాత్మకంగా నిలుస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి మండలం, గొర్లముదివీడు గ్రామంలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌ల నూతన భవనాల ప్రారంభోత్సవంలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

'ఖనిజ సంపదను దోచేందుకే మణిపూర్ మారణకాండ'

రాయచోటి అర్బన్ : ఈశాన్య రాష్ట్రాల్లోని ఖనిజ సంపదలను అంబానీ, ఆదానీలకు దోచిపెట్టేందుకే కేంద్రప్రభుత్వం మణిపూర్‌లో మారణకాండను ప్రోత్సహిస్తోందని ఏపీ పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయచోటి రవిశంకర్, నేతలు ఎం.రవిశంకర్, రెడ్డెయ్యలు ఆరోపించారు. గురువారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద వారు మణిపూర్ మారణ కాండపై ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ దేశంలోనే సంచలనం కలిగించిన మణిపూర్ మారణకాండపై కేంద్ర ప్రభుత్వం దాదాపు 3 నెలల పాటు నోరు విప్పకపోవడం దారుణమన్నారు. కేంద్రహోం శాఖమంత్రి మణిపూర్‌లో పర్యటించినా, రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ అల్లర్లను సమూలంగా అణచివేస్తామని బీరాలు పలికినా నేటికీ పరిస్థితి మారలేదన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లోని అత్యంత విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు ఒక పథకం ప్రకారం అల్లర్లు జరుగుతున్నాయన్నారు. మణిపూర్‌లో పాలకులే మెయితీలు, నాగా,కుకీల నడుమ విభేధాలు సృష్టించి పెంచిపోషిస్తున్నందుకే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా కేంద్రం మణిపూర్ అల్లర్లను పూర్తిస్థాయిలో నియంత్రించాలంటూ వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీసీఎల్‌సీ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్, న్యాయవాది చిన్నయ్యలు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

రాజంపేట : గణనాథుని పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆర్డీఓ సభా భవనంలో గణేష్ పండుగ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాలను పెట్టాలని, తగిన ఎత్తులో ఉండాలని కోరారు. నిమజ్జనాలకు పిల్లలను పంపరాదన్నారు. ఊరేగింపు, ఉత్సవాలు, మండపాల వద్ద మద్యంసేవించి రాకూడదన్నారు. మండపాల విద్యుద్దీపాలంకరణలపై జాగ్రత్తలు పాటించాలన్నారు. రాజంపేట డీఎస్పీ చైతన్య మాట్లాడుతూ మండపాల నిర్వహణ సక్రమంగా నిబంధనలకు అనుగుణంగా కొనసాగాలన్నారు. మండపాల ఏర్పాట్లలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊరేగింపులు, నిమజ్జనాలు తదితర విషయంలో పోలీసుశాఖకు మండపాల నిర్వాహకులు, భక్తులు సహకరించాలన్నారు. ముందస్తుగా వినాయచవితి శుభాకాంక్షలను ఆర్డీఓ, డీఎస్పీలు తెలియచేశారు. సమావేశంలో కమిషనరు జనార్దన్‌రెడ్డి, తహసీల్దారు సుబ్రమణ్యంరెడ్డిలు పాల్గొన్నారు.